

సంగారెడ్డి జిల్లాలో నలుగురు సీఐల బదిలీలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఎస్పీ చెన్నూరి రూపేష్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీలో వెయిటింగ్‌లో ఉన్న సీఐ ఎస్.క్రాంతికుమార్‌ను సంగారెడ్డి రూరల్‌కు, మల్టీజోన్-2లో వెయిటింగ్‌లో ఉన్న డి.వెంకటేష్‌ను కొండాపూర్‌కు, వి.శివకుమార్‌ను సంగారెడ్డి సీసీఎస్‌కు బదిలీ చేశారు. కొండాపూర్‌లో ఉన్న ఎస్.చంద్రయ్యను మల్టీజోన్-2లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

ఊళ్లో ఉండేదెట్లా!!

చెవుల్లో కంపెనీ కట్టుకున్నట్టు.. భారీ శబ్దాలు

భూగర్భంలోకి వర్థ్య జలాలు

ట్రక్కుల రాకపోకలతో ధ్వంసమవుతున్న రోడ్లు

చుట్టుపక్కల గ్రామాల్లో జన జీవనం నరకప్రాయం

25 ఎకరాల్లో 200 టన్నులకు విస్తరించే ప్రయత్నాలు!



పరిశ్రమ వాహనాలు వెళ్లడంతో దండుపల్లి వద్ద ధ్వంసమైన రోడ్డు

మనోహరాబాద్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): 'సీడ్ పరిశ్రమ అని ప్రజలను ఒప్పించి.. స్టీల్ పరిశ్రమ పెట్టారు... ఇంతింతై.. ఇల్లంతై అన్నట్టు.. నాలుగైదు ఎకరాల్లో 30 టన్నుల ఫర్నెస్ సామర్థ్యంతో ప్రారంభించి.. 25 ఎకరాల్లో 200 టన్నుల సామర్థ్యానికి విస్తరించేందుకు సిద్ధమవుతున్నారు... రాత్రయ్యిందంటే చెవులు చిల్లులు పడేలా శబ్దాలు.. ఘాటైన వాసనలు.. పగలంతా రోడ్లపై భారీ ట్రక్కులు.. బోరు వేస్తే కాలుష్య జలాలు... ఈ కంపెనీ మూలంగా 20 ఏళ్లుగా బతుకు నిత్య నరకంగా మారింది. ఊళ్లో సగం మంది ఈ బాధ పడలేక వేరే ఊళ్లలో కిరాయికి ఉంటున్నారు. ఎటూ వెళ్లలేని వాళ్లం రోజూ చస్తూబతుకుతున్నాం...' అంటూ మనోహరాబాద్ మండలం రంగాయపల్లి, చెట్లగౌరారం గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలోని స్టీల్ పరిశ్రమతో ఇబ్బందులు పడుతున్నామని కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారులను కలిసి మొరపెట్టుకున్నారు.

గ్రామస్థులకు తప్పుడు సమాచారం

పరిశ్రమ ఏర్పాటు సమయంలో సీడ్ కంపెనీ అని చెప్పారని, ఆ తరువాత రాజకీయ నాయకులకు డబ్బులు ఇచ్చి లొంగదీసుకుని కొనసాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని, ప్రజలందరూ వ్యతిరేకంగా గళమెత్తినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇది చాలదన్నట్టు పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం పెంచుతున్నారని మండిపడుతున్నారు. ప్రస్తుతం పరిశ్రమలో 30 టన్నుల సామర్థ్యంతో ఫర్నెస్ ఉండగా, 200 టన్నులకు

మిగతా 8వ పేజీలో

20 ఏళ్లుగా నిత్యం నరకం

స్టీల్ పరిశ్రమ వల్ల 20 సంవత్సరాల నుంచి నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ఇళ్లను వదిలేసి వేళ్లాలంటే ఆర్థిక స్థోమత లేక నిత్యం చస్తూ బతుకుతున్నాం. రాత్రివేళ కంపెనీ నుంచి దుర్వాసన, పెద్దపెద్ద శబ్దాలు వెలువడుతున్నాయి. అనేకమందికి వ్యాధులు వస్తున్నాయి. పరిశ్రమకు వ్యతిరేకంగా ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రామంలోని కొందరు పెద్దలకు పరిశ్రమ యాజమాన్యం డబ్బులు ఇచ్చి చెప్పుచేతుల్లో పెట్టుకుని ప్రజలు పరిశ్రమ వద్దకు రాకుండా అడ్డుకుంటున్నారు. అధికారులు స్పందించి పరిశ్రమను మూసేయించాలి.



-మాదిపెద్ద బాలశ్యామల, రంగాయపల్లి

సీడ్ కంపెనీ అని నమ్మించి..

సీడ్ కంపెనీ అని గ్రామస్థులను నమ్మించి పరిశ్రమ పెట్టి.. ప్రస్తుతం 25 ఎకరాలకు విస్తరించారు. గ్రామం పక్కనే పరిశ్రమ ఉండడంతో రాత్రయ్యిందంటే చెవులు చిల్లులు పడేలా శబ్దాలు వస్తున్నాయి. దుమ్మూధూలితో గాలి కలుసితమవుతున్నది. భూగర్భ జలాలూ కలుషితమవుతున్నాయి. నిత్యం నరకం చూస్తున్నాం. గ్రామం నుంచి ఒక్కొక్కరుగా వలస పోతున్నారు. ఇలాగే కొనసాగితే ఇంకొన్ని సంవత్సరాల్లో ఊరు ఖాళీ అవుతుంది. అధికారులు స్పందించి పరిశ్రమను గ్రామం పక్క నుంచి తీసివేయించి ప్రజల ప్రణాలు కాపాడాలి.



-వెంకటేష్ యాదవ్, రంగాయపల్లి



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

సొమ్మొకడిది.. సోకొకడిది అన్న చందాన జిల్లాలో రైస్ మిల్లర్ల దందా సాగుతున్నది. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన బియ్యాన్ని మర ఆడించి బియ్యం ఇవ్వడం కోసం రైస్‌మిల్లులకు (సీఎంఆర్) కేటాయిస్తుంది. మిల్లర్లు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎఫ్‌సీఐకి ధాన్యానికి బదులుగా బియ్యం మరాడించి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, పలువురు మిల్లర్లు వడ్లను మరాడించి బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. ప్రభుత్వానికి జమ చేయాల్సిన బియ్యం ఇవ్వకుండా ఎగవేశారు. మెదక్ జిల్లాలో బియ్యం బకాయిలు రూ.240 కోట్ల వరకు ఉన్నాయి.



సీఎంఆర్ ఎగవేతలు రూ. 240 కోట్లు

- లీజు డ్యాక్యుమెంట్‌తో పక్కదారి పట్టించిన మిల్లర్లు
- ఈ సీజన్ నుంచి అఫిడవిట్ ఇస్తేనే సీఎంఆర్ కేటాయింపులు

మెదక్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన వడ్లకు సరిపడా సీఎంఆర్ ఇవ్వకుండా కొందరు మిల్లర్లు ఎగవేతలకు పాల్పడుతున్నారు. రాజకీయ నేతలు, అధికారుల అండదండలతో దర్జాగా ప్రభుత్వ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కోట్లాది రూపాయల మేర బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలుతోంది. ఇది గుర్తించిన ప్రభుత్వం మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి నడుం బిగించింది. ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆస్తులు జప్తు చేయడానికి సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే తహసీల్దార్లు పలువురు మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వారి ఆస్తులకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరపవద్దని పౌరసరఫరాలశాఖ అధికారులు లేఖలు రాశారు.

రూ.18 కోట్లు రికవరీ

జిల్లావ్యాప్తంగా 13 రైస్‌మిల్లుల యజమానులు సుమారు రూ.240 కోట్ల మేర సీఎంఆర్ బియ్యం జమ చేయకుండా ఎగనామం పెట్టినట్టు సివిల్‌సప్లై అధికారులు పేర్కొంటున్నారు. సొమ్ము రికవరీ కోసం అధికారులు నానాఅవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకు రూ.18 కోట్లు మాత్రం రికవరీ చేయగలిగారు. మిగిలిన రూ.222 కోట్ల వసూళ్ల కోసం మిల్లర్ల ఆస్తులను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన రెండు మిల్లుల యజమానులు రూ.44 కోట్లు బకాయిలు ఉన్నారు. వీరికి ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేయగా, త్వరలో ఆస్తులు అటాచ్ చేస్తామని హెచ్చరించారు. హవేళీఘనపూర్ మండలం పాతూర్‌లోని రైస్‌మిల్, రామాయంపేట మండలం కాట్రియాలలోని రైస్‌మిల్ ఓనర్లు రూ.48 కోట్ల మేర సీఎంఆర్ రైస్ ఎగవేతలకు పాల్పడ్డారు. వీరికి సివిల్‌సప్లైశాఖ అధికారులు నోటీసులైతే ఇచ్చారు కానీ ఇంకా సొమ్ము రికవరీ చేయలేదు. మాసాయిపేటలోని ఓ రైస్‌మిల్ పేరిట రూ. 5 కోట్లు బకాయిలు పెండింగులో ఉన్నాయి. పాపన్నపేటలోని మిల్లు రూ.కోటిన్నర, హవేళీఘనపూర్ మండలం వాడిలోని రైస్‌మిల్ రూ. 3కోట్లు బాకీ ఉండగా ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.34 లక్షలు మాత్రం చెల్లించారు. సర్దనలోని మిల్లు యజమాని రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఆ డబ్బు రాబట్టడానికి అధికారులు యజమాని ఇల్లు, స్థిరాస్తులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. నర్సాపూర్‌లోని రెండు మిల్లులు, కాగజ్ మద్దూర్‌లోని మిల్లు యజమాని రూ.48 కోట్లు బకాయి ఉండగా అతని నుండి ఇప్పటి వరకు రూ.8 కోట్లు రాబట్టారు.

అఫిడవిట్ ఇస్తేనే కేటాయింపులు..

ఈ సీజన్ నుంచి రైస్ మిల్లర్లు అఫిడవిట్ ఇస్తేనే ధాన్యం కేటాయిస్తున్నాం. మిల్లు యజమాని నుంచి వంద రూపాయల స్టాంప్ కాగితంపై అగ్రిమెంట్ చేసుకుంటున్నాం. జిల్లాలో సీఎంఆర్ డీఫాల్టర్ల నుంచి ఇప్పటివరకు రూ.18 కోట్లు రికవరీ చేశాం. మరి కొందరు త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు.

-హరికృష్ణ, సివిల్‌సప్లై డీఎం, మెదక్

కోళ్లఫారం గోడ కూలి

ఇద్దరు వలస కూలీలు మృతి

చిన్నశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న కోళ్లఫారం గోడ కూలడంతో ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారం తండాలో ఓ రైతు నూతనంగా కోళ్లఫారాన్ని నిర్మిస్తున్నాడు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అసికుల్ ఆలం (30), రఫిక్ ఆలం (28) నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు గోడ కూలడంతో శిథిలాల కిందపడి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వివరాలను సేకరించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.



రఫిక్ ఆలం (ఫైల్)



అసికుల్ ఆలం (ఫైల్)

సర్వేతో కుటుంబ సమగ్ర అభివృద్ధికి పథకాలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర అభివృద్ధికి సర్వే ఉపయోపడుతుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు ఈ సర్వేలో సేకరించిన సమాచారం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన వివరాల డేటాఎంట్రీ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పొరపాట్లకు తావులేకుండా కుటుంబం సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన ఎన్యూమరేటర్లకు సూచించారు. సర్వేతో ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు రూపొందించే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి కుటుంబ సమగ్ర సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. రోజువారీగా సర్వే వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, డీటీ శ్రీనివాస్, ఈవో వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో సర్వే చేస్తున్న తీరును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఖాళీ స్టిక్కర్లు అతికించిన ఎన్యూమరేటర్‌కు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునిపల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : 'ఖాళీ స్టిక్కర్లు..మొక్కుబడి సర్వే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మండలంలోని గార్లపల్లిలో ఓ ఇంటి డోరుకు ఖాళీ స్టిక్కర్ వేయడంపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి అధికారులు స్పందించి పూర్తి వివరాలతో కొత్త స్టిక్కర్ అతికించారు. నిర్లక్ష్యంగా ఖాళీ స్టిక్కర్ అతికించిన ఎన్యూమరేటర్‌కు ఎంపీడీవో హరినందన్‌రావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సర్వేను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



అమీన్‌పూర్‌లో హైడ్రా అలజడి

కూల్చివేతల వ్యర్థాలు తరలించేందుకు యత్నం



పటేల్‌గూడలో కూల్చివేసిన ఇళ్ల వ్యర్థాలను తొలగించేందుకు వచ్చిన హైడ్రా బృందం

పటాన్‌చెరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లా పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీలో సోమవారం హైడ్రా సిబ్బంది పర్యటించడంతో అలజడి రేగింది. గతంలో మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడలో రెవెన్యూ, హైడ్రా బృందాలు సంయుక్తంగా 28 ఇళ్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. కూల్చివేసిన వ్యర్థాలను తొలగించేందుకు హైడ్రా సిబ్బంది ఎక్స్‌వేటర్లతో ఉదయం 9గంటల ప్రాంతంలో ఇళ్ల వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు హైకోర్టుస్టే ఉత్తర్వులు చూపడంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 343 ప్రభుత్వ సర్వేనంబర్లలో ఆక్రమణలను హైడ్రా సిబ్బంది పరిశీలించారు. బంకొమ్ము చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని కట్టడాలను పరిశీలించారు. గతంలో మండల పరిధిలోని ప్రభుత్వ సర్వే నెంబర్లలో పెద్దఎత్తున ఆక్రమణలు చోటు చేసుకున్నాయని హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సమగ్ర సర్వేకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములు పెద్దఎత్తున విస్తరించి ఉన్న 993, 630 సర్వేనంబర్లలో ఆక్రమణలను ఇప్పటికే గుర్తించిన తహసీల్దార్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రాకు సమగ్ర నివేదిక సమర్పించారు. సర్వేలో తేలిన సుమారు 700ల పైచిలుకు అక్రమ కట్టడాలకు నోటీసులు సైతం జారీ చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువుతో పాటు, శంభునికుంట, సంబిచెరువు, శెట్టికుంటల్లోని ఆక్రమణలను సైతం గుర్తించారు. చాలా రోజుల విరామం తరువాత తిరిగి హైడ్రా సిబ్బంది మండల పరిధిలో పర్యటించడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. త్వరలోనే ఆక్రమణలను తొలగించే కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలుస్తోంది.

డయాలసిస్ బాధితులకు ఉపశమనం

- నర్సాపూర్‌లో ఇటీవల డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి
- నేటి నుంచి సేవలు
- నియోజకవర్గంలోని రోగులకు తప్పిన వ్యయప్రయాసలు

8లో

గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్ షురూ

- 1,100 మంది క్రీడాకారుల హాజరు
- విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



పోటీల ప్రారంభ కార్యక్రమంలో మార్చింగ్ చేస్తున్న విద్యార్థినులు

7

గ్రూప్-3కు పకడ్బందీ ఏర్పాట్లు

● మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల కోసం జిల్లాలోని మెదక్ సబ్‌డివిజన్‌లో 12, తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 7, మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజేషన్ వంటివి చేపట్టాలన్నారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 6, రూట్ ఆఫీసర్స్ 6, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ చీఫ్ సూపరింటెండెంట్ 19 మంది చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు. లోనికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగే పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5867 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను న పడపాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ఉంటుందని, సమయానికి అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మెంచు నగేష్

వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల నిరసన



గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కోహీర్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోహీర్ గ్రామపంచాయతీ వద్ద పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము మురికి కాలువలు, వీధులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నప్పటికీ జీతాలు సకాలంలో చెల్లించడం లేదని వాపోయారు. 23 మంది కార్మికులకు నాలుగు నెలలకు సంబంధించిన రూ.9.20 లక్షలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధికంగా సమ్మెలో కొనసాగుతామని వారు మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా రాసిచ్చారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కల్హేర్/వెల్దుర్తి/హత్నూర/ చిన్నశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా విద్యార్థులు పలు క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. హత్నూర మండల పరిధిలోని సిరిపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.హరిప్రసాద్, 8వ తరగతికి చెందిన కాలే నాగేశ్వరీ జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను మాజీ సర్పంచ్ నరేందర్ శాలువాతో సన్మానించారు. సిర్గాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన గోకుల్‌కృష్ణ 68వ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 38 కేజీల విభాగంలో మూడోస్థానంలో నిలిచారు. పాఠశాల హెచ్‌ఎం, సిర్గాపూర్ మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మనేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నందిని అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను, ఉమ్మడి మెదక్ జిల్లా పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి నందినిని ఎంఈవో యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నందినీకి రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీలలో చిన్నశంకరంపేట మండలంలోని టీఎస్ఎమ్ఎస్, మొదటిస్థానం, మిర్జాపల్లి హైస్కూల్ రెండో స్థానంలో నిలిచినట్లు ఎంఈవో పుష్పవేణి తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

చిన్నశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రైతులు మండలంలోని గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు మెదక్ - చేగుంట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, నవంబరు 11 : టూరిస్టు బస్సులో నిషేధిత గోవా మద్యం తెలంగాణకు తీసుకువస్తున్న క్రమంలో సోమవారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టువద్ద పట్టుకున్నామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ బృందం వివరాల ప్రకారం.. తమ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులతో కలిసి మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలను చేపట్టాం. అందులో భాగంగా టూరిస్టు బస్సులో తనఖీలు చేయగా 11 లీటర్ల నిషేధిత మద్యం పట్టుబడింది. ఈ మేరకు మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వేర్వేరు కేసుల్లో 8 ఏళ్ల జైలు

● రూ.వెయ్యి చొప్పున జరిమానా

రామచంద్రాపురం, నవంబరు 11 : రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022వ సంవత్సరంలో ఒకేరోజు జరిగిన కానిస్టేబుల్‌పై కత్తిపోట్లు, చైన్‌స్నాచింగ్ కేసులు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఈ కేసుల్లో రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 26వ తేదీ 2022న భెల్ హెచ్‌ఐజీలో ఓ మహిళ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెలారు. అదే రోజు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు జరిగాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు గస్తీని మరింతగా పెంచారు. గండమ్మ ఆలయం వద్ద గస్తీ కాస్తున్న సీసీఎస్ పోలీసులు యాదయ్య, రవికి ఇద్దరు వ్యక్తులు పల్సర్‌పై అనుమానస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని వెంబడించి హెచ్‌ఐజీ వద్ద పట్టుకునే ప్రయత్నం చేయగా నిరంజన్ అనే వ్యక్తి కత్తితో పోలీసు యాదయ్యపై దాడిచేశాడు. పోలీసులు నిందితులు నిరంజన్(23), రాహుల్(21)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడి కేసులో ఏడు సంవత్సరాలు, చైన్ కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు సీఐ జగన్నాథ్ తెలిపారు. ఇద్దరు నేరస్థులు కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా, హుమ్నాబాద్ అయ్యర్వాడీకి చెందినవారని తెలిపారు.

కారు డ్రైవరే దొంగ

● ముగ్గురు నిందితుల రిమాండ్

జోగిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యజమాని ఇంట్లో దూరి.. తల్లిని బంధించి, చోరీకి పాల్పడ్డ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. వట్‌పల్లి ఎస్‌ఐ విఠల్‌తో కలిసి సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి బీదర్ పట్టణంలో ఎరువుల దుకాణాన్ని నడుపుతుండగా, అక్కడే సొంత ఇల్లు కట్టుకుని నివిసిస్తున్నాడు. ఆయనకు పల్వట్లలో 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే, వెంకట్‌రెడ్డి తల్లి సునందమ్మ పల్వట్లలోని ఇంట్లో ఒంటరిగా ఉంటూ పనులను చూసుకుంటోంది. ఈ క్రమంలో బీదర్‌కి చెందిన వెంకట్‌రెడ్డి దూరపు బంధువు మహిపాల్‌రెడ్డిని కారు డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. మహిపాల్‌రెడ్డి పాత నేరస్థుడన్న విషయం వెంకట్‌రెడ్డికి తెలియదు. కంది జైలులో పరిచయం అయిన పాత నేరస్థులు మొహిసిన్, సోహైల్‌తో కలిసి మహిపాల్‌రెడ్డి పల్వట్లలోని ఇంట్లో దొంగతనానికి పథకం రచించాడు. గత నెల 21న రాత్రి సునందమ్మను బంధించి 4 తులాల బంగారు గొలుసు, 2 తులాల చెవి కమ్మలతోపాటు, రూ. 20 వేల నగదును దోచుకుని పారిపోయారు. వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు విచారించి నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వివిధ రాష్ట్రాల నుంచి మెటీరియల్..

డూప్లెక్స్‌గా నిర్మించిన భవనానికి వివిధ రాష్ట్రాల నుంచి మెటీరియల్ తెప్పించారు. మైసూర్ నుంచి ప్లైవుడ్, గుజరాత్ నుంచి గ్రానైట్, బెంగుళూర్ నుంచి పార్కింగ్ గ్రానైట్, బాంబె నుంచి లైటింగ్‌ను తెప్పించారు. భవనంలోకి వెళ్లగానే ఎత్తైన బుద్ధుడి చిత్రం ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుంది. దీనిని కోల్‌కతాకు చెందిన ఆర్టిస్టుతో వేయించారు. సెన్సార్లతో డోర్లు, లైట్లు వంటివి వెలిగేలా ఏర్పాట్లు చేశారు. భవనానికి విద్యుత్ సరిపడేలా పైన సోలార్ ప్లాంట్, ప్రహరీ చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. భవనంలో ఫర్నిచర్, ఓపెన్ కిచెన్, డ్రెస్సింగ్ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు ఇలా సకల వసతులున్నాయి.



జిల్లెలగడ్డలో అమ్మానాన్న నిలయం

అమ్మా.. నాన్న.. ఓ అందమైన భవనం

- వారిపై ప్రేమతో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న ఇంటీరియల్ డిజైన్లు

హుస్నాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని జిల్లెలగడ్డ గిరిజన తండాకే హైలెట్ ఆ భవనం. అధునాతనమైన ఇంటీరియర్ డిజైన్లతో తండాకు చెందిన వ్యాపారి లావుడ్య వీరన్ననాయక్ తన అభిరుచికి అనుగుణంగా నిర్మించారు. పుట్టిన ఊరులో నివాసించాలనే ఆకాంక్ష.. తల్లిదండ్రులపై ఉన్న ప్రేమతో 'అమ్మానాన్నల నిలయం' పేరిట అద్భుతంగా తీర్చిదిద్దాడు. హుస్నాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదారిలో పక్కన ఈ భవనం చూపరులను ఆకర్షిస్తున్నది. వీరన్న నాయక్ మొదట ఇటుకబట్టీలు, వ్యవసాయ కూలీ కాగా, ప్రస్తుతం ఇటుక బట్టీలతో పాటు పలు వ్యాపారాలు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. హైదరాబాద్, వరంగల్ లోనూ భవనాలున్నప్పటికీ తన ఎదుగుదలకు దోహద పడిన సొంత ఊరులో నివాసం ఉండాలని కోరికతో దీన్ని నిర్మించినట్లు చెబుతున్నాడు. ఆయన భార్య విజయ 2009 నుంచి 2014 వరకు ఈ తండాకు సర్పంచ్‌గా కూడా పని చేశారు.



భవన ప్రవేశ గదిలో బుద్ధుడి చిత్రం, జూమర్ లైట్



సోలార్ ప్లాంట్



విశ్రాంతి గదిలో వీరన్ననాయక్



భవన ప్రవేశద్వారం ఎదుట..



కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లండి

భవిష్యత్తు మనదే.. నర్సాపూర్ ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నర్సాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. 9వ తేదీన కొల్చారంలో రైతుల దీక్ష విషయాలు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ నర్సాపూర్ నియోజకవర్గంలో రైతుల దీక్ష విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని వారికి సూచించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ బలంగా ఉందని, అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు ఏ మాత్రం భయపడవద్దని అని అన్నారు. మీకు తాము ఎప్పుడు అండగా ఉంటామని అధికార పార్టీ చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ ప్రజల్లోకి వెళ్లాలన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ సునీతారెడ్డికి అండగా ఉండాలని సూచించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేస్తున్న తప్పిదాలే వారికి శాపంగా మారి ఓటమి చెందడం ఖాయమన్నారు. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే అని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాయకులు సత్యంగౌడ్, హుస్సేన్, ప్రసాద్, దుర్గారెడ్డి, ప్రవీణ్, నరహరి, శేఖర్ పోచయ్య, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్ షురూ



హాజరైన వివిధ జిల్లా క్రీడాకారులు

- 1100 మంది క్రీడాకారులు హాజరు
- విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్ అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం 10వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన 13 గురుకులాల క్రీడాకారులు 1105 మంది హాజరయ్యారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, కో ఆర్డినేటర్ సువర్ణలత క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ, ఒలంపిక్స్, సొసైటీ జెండాలను ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. మెదక్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పట్టణ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. మనం శారీరకంగా, మానసికంగా బలపడాలంటే క్రీడలు చాలా ఉపయోగపడుతాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సువర్ణలత మాట్లాడుతూ.. నిరంతర సాధనతోనూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, 13 గురుకులాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

తొలిరోజు క్రీడాపోటీలు..

అండర్- 14, 17, 19 మూడు విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, క్యారమ్, హ్యాండ్‌బాల్, రన్నింగ్, బాల్ బ్యాడ్మింటన్, డిస్కస్‌త్రో, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీల జరుగనుండగా.. తొలి రోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. చెస్ అండర్-17 కేటగిరీ రామాయంపేట ప్రథమ, 3 వేల మీటర్స్ రన్నింగ్ అండర్-19 కేటగిరీలో మెదక్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 14 వ తేదీ వరకు స్పోర్ట్స్ మీట్ జరుగనుంది.

విద్యార్థులు పరిశోధనాత్మకంగా చదవాలి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశోధనాత్మకంగా చదవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్(జేడీ) లక్ష్మీనారాయణ సూచించారు. సంగారెడ్డి పట్టణం గీతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐటీ రామయ్య-ఇష్టా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదవాలే తప్పా ఒత్తిడితో కాదన్నారు. అప్పుడే విజయం సాధ్యమవుతుందని గుర్తించాలన్నారు. ప్రతీ ఒక్కరు మంచి అనుభూతితో లక్ష్యం దిశగా ముందుకెళ్లాలన్నారు. ఏదేనీ 21 రోజులు చేస్తే అది అలవాటుగా మారుతుందని, విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, సెల్‌ఫోన్, సోషల్ మీడియా, ఇతరత్ర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యాభ్యాస దశలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థికి ఇంటర్ విద్య చాలా కీలకమని కష్టపడి చదివి అద్భుత భారతదేశాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇష్టా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వినోద్, కార్తిక్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కుటుంబ పోషణ భారమై వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సోమ్లాతండాలో జరిగింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం మండల పరిధిలోని తండాకు చెందిన మునావాత్ సోమ్లా(38) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేయలేక కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో మనోవేదనకు గురైన అతడు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. అర్ధరాత్రి వేళ ఊరి బయటకు వెళ్లిన గ్రామస్థులకు సోమ్లా మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సోమవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

బాధ్యతలు స్వీకరించిన బీసీ గురుకులాల ఆర్‌సీవో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్‌గా(ఆర్‌సీవో)గౌతమ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఆర్‌సీవోగా పనిచేసిన ప్రభాకర్ గత ఆగస్టు నెలలో ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఆర్‌సీవోగా సదాశివపేట(సంగారెడ్డి)పాఠశాల ప్రిన్సిపాల్ సంతోషి కొనసాగుతున్నారు. తాజాగా నూతన ఆర్‌సీవోగా గౌతమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బదిలీపై రావడంతో సంతోషి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల నిర్వహించిన ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లా పదో తరగతిలో 304 మంది పరీక్షకు హాజరు కాగా, 195 మంది ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో 61 మందికి 33 ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లాలో 258 మందికి 132 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌లో సంగారెడ్డి జిల్లాలో 709 మందికి 339 మంది, మెదక్ జిల్లాలో 179 మందికి 115 మంది, సిద్దిపేట జిల్లాలో 377 మందికి 192 మంది ఉత్తీర్ణులయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 20 వ తేదీ వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

అప్రెంటీస్ మేళాకు విశేషస్పందన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించారు. నేషనల్ అప్రెంటీస్ మేళాలో ఎనిమిది కంపెనీలు హాజరయ్యారు. అప్రెంటీస్ చేసేందుకు ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు సుమారు 500 మంది హాజరయ్యారు. అప్రెంటీస్ మేళాకు మంచి స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు.



అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

క్రైం కార్నర్

డీసీఎం, బైక్ ఢీకొని ఒకరి మృతి



వేణుగోపాల్ (ఫైల్)

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డికి చెందిన వడ్డెపల్లి వేణుగోపాల్ (32) ఆరు నెలల నుంచి హైదారాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అదివారం తన మిత్రుడు బొయిని రంజిత్ కుమార్ తో కలిసి హైదారాబాద్ నుంచి గ్రామానికి వస్తుండగా చేగుంట బైపాస్ రోడ్డు మక్కరాజిపేట్ బ్రిడ్జివద్ద రాంగ్ రూట్‌లో మూలమలుపు దాటుతున్న డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వేణుగోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న రంజిత్ కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోడ పైనుంచి పడి వలస కూలీ..

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకాబ్ పరిశ్రమలో హమాలీ కూలీగా పని చేస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట శివారులోని సోమవారం చోటుచేసకుంది. బీహార్‌కు చెందిన అభిమన్యు ఆదివారం రాత్రి పరిశ్రమ వద్ద పావురాలను పట్టుకనేందుకు గోడ ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు, బంధువులు పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటిపై నుంచి జారిపడి వ్యక్తి..



రాజు(ఫైల్)

మనోహరాబాద్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనాయిపల్లిపీటీ గ్రామానికి చెందన చిర్మనీ రాజు(52) తన ఇంటిపై చెట్టుకొమ్మను విరుస్తుండగా కాలుజారీ కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



చింటూ(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పేట ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దశంకరంపేటకు చెందిన జంగం చింటూ(25).. భార్య శిరీష, కొడుకుతో కలిసి బీరంగూడలో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం భార్య ప్రసవ సమయంలో వైద్య ఖర్చుల కోసం రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. కూలి పనులతో అప్పు ఎలా తీరుతుందని రోజూ భార్యతో చెబుతూ మదనపడేవాడు. ఈ క్రమంలో బంధువుల ఇంట పెళ్లి కోసం కుటుంబంతో కలిసి ఈ నెల 8న పెద్దశంకరంపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. సమగ్ర కుటుంబ సర్వే నిమిత్తం ఇక్కడే ఉండాలని భార్యకు సూచించి ఆదివారం సాయంత్రం బయటికెళ్లి గ్రామ శివారులోని తిరుమలాపూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక కూలీ..



రమేష్(ఫైల్)

రామయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చే మార్గంలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామయంపేట మండలం లక్ష్మాపూర్‌కు చెందిన వడ్డే పెద్ద రమేష్ (48)కు ముగ్గురు కూతుర్లు. పలుచోట్ల అప్పు చేసి ఇద్దరి కూతర్లకు పెళ్లి చేశాడు. కూలీ పనులతో అపుపలు తీర్చే స్థోమత లేకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటికెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సుగుణ చుట్టుపక్కల వారి సహాయంతో వెతకగా చెట్టుకు రమేష్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..



అనిత(ఫైల్)

టేక్మాల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాతలోత్ అనిత(28) ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయింది. పొద్దున ఎంతకీ నిద్రలేకపోవడంతో వెళ్లి చూడగా మృతిచెంది కనిపిచింది. ఇంటి పక్క వారితో గొడవ కారణంగా తన భార్య మృతిచెందిదని భర్త ఆరోపించాడు. సమాచారం అందుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త నర్య నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు

- గుమ్మడిదల చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- వివిధ జిల్లాల్లో 200 వరకు కేసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

జిన్నారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడతున్న నిందితుడిని పోలీసులు సోమారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిన్నారం సర్కిల్ కార్యాలయంలో సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న గుమ్మడిదల గ్రామానికి చెందిన చిమ్ముల రవీందర్‌రెడ్డి నివాసంలో పట్టపగలు చోరీ జరగగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు హమీద్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హైదరాబాద్ చార్మినార్ ఖాద్రిచమాన్ ప్రాంతానికి హమీద్ తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతడిపై పలు జిల్లాలో 200వరకు చోరీ కేసులు ఉన్నాయి. కేసులో చాకచాక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

మూఢనమ్మకాలతో భవిష్యత్ అంధకారం

- ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, నవంబరు (ఆంధజ్యోతి)11: మూఢనమ్మకాలతో భవిష్యత్‌ను అంధకారం అవుతుందని ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కూమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో కాళ్లకల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూఢనమ్మకాలపై నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సైంటిఫిక్ స్టూడెంట్ పెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ హాజరై మాంత్రికుల, భూత వైద్యుల, మోసం చేసే కుట్రలను, సైన్స్ మ్యూజిక్ షో రహస్యలను వివరించారు. అనంతరం ఎస్ఐ సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింగం, కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 'ప్రజావాణి'



అర్జీదారు సమస్యను తెలుసుకుంటున్న మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెటొద్దని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ వారి నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 65 దరఖాస్తులు రాగా, ఇందులో అధికంగా, ధరణి సమస్యలకు సంబంధించినవి ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీడీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సంగారెడ్డిలో ప్రజావాణికి 39 అర్జీలు



సంగారెడ్డి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గడ్డపోతారంవాసులు

సంగారెడ్డి టౌన్/జిన్నారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 39 అర్జీలు అందాయి. ప్రజల నుంచి అదనపు కలెక్టర్ మాధురి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయవద్దని గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని స్థానికులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా అధికారులను ఆదేశించారు.

డయాలసిస్ బాధితులకు ఉపశమనం

- నర్సాపూర్‌లో వారం క్రితం కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్
- నియోజకవర్గంలోని రోగులకు వ్యయప్రయాసలు తప్పినట్టే
- నేటి నుంచి సేవలు ప్రారంభం



నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో డయాలిసిస్ కేంద్రం, బెడ్‌లవద్ద సిద్ధంగా ఉన్న డయాలిసిస్ యంత్రాలు

నర్సాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇప్పటి వరకు మూత్రపిండాల వ్యాధితో బాధపడేవారు డయాలసిస్ చేయించుకోవడానికి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి లేదా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ నెల 12వ తేదీ నుంచి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ సేవలు ప్రారంభించనుండటంతో వారికి ఇబ్బందులు తొలగనున్నాయి.

సేవలందించేందుకు సిద్ధం

నర్సాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో రూ.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని వారం రోజుల క్రితం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నెల 12వ తేదీ నుంచి ఈ డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. టెక్నీషియన్లకు కూడా ప్రత్యేకంగా నియమించారు. ఐదు పడకల డయాలసిస్ కేంద్రంలో ఐదు బెడ్లతో పాటు బెడ్డుకు ఒకటి చొప్పున డయాలసిస్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు.

తొలగనున్న ఇక్కట్లు

నర్సాపూర్ నియోజకవర్గం నుంచి మెదక్‌లోని జిల్లా ఆసుపత్రికి 22 మంది డయాలసిస్ చేసుకోవడానికి వెళ్లేవారు. వారికి వెళ్లినప్పుడల్లా వ్యయప్రయాసాలకు గురై ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. నర్సాపూర్‌లోని ఆసుపత్రిలోనే డయాలసిస్ చేసుకునే సౌకర్యం ప్రభుత్వం కల్పించడంతో వారికి ఆ ఇబ్బందులు తప్పినట్టయ్యింది.ఇంతవరకు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకోవడానికి 18మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మెదక్‌కు వెళ్లే వారితో పాటు కొందరు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా డయాలసిస్ చేయించుకుంటున్న వారూ ఉన్నారు. వారు కూడా ఇక్కడ సేవలు వినియోగించుకునే అవకాశం ఉండటంతో వారిపై ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రైవేటుగా చేయించుకుంటే వెళ్లిన ప్రతీసారి కనీసం రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు సద్వినియోగం చేసుకుంటే డాక్టర్ సేవలు, ఇతర పరీక్షలు కూడా ఉచితంగా పొందవచ్చు.

24గంటలు సేవలు

నర్సాపూర్‌లోని డయాలసిస్ సేవలు 24గంటలు అందించనున్నారు. ఇందుకుగాను ఇప్పటికే ముగ్గురు టెక్నీషియన్లను నియమించారు. వారు మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ వచ్చినవారికి సేవలు అందిస్తారు. ఒక్కో డయాలసిస్ రోగి వారానికి మూడుసార్లు చేయించుకోవాల్సి వస్తుంది. ఇక నుంచి డయాలసిస్ బాధితులకు కొంతవరకు ఉపశమనం లభించనుండటంతో రోగులతోపాటు వారి బంధులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

గ్రామాల్లో చెరువుల సర్వే

కల్హేర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువుల మరమ్మతు పనుల మంజూరు కోసం సోమవారం నీటిపారుదలశాఖ అధ్వర్యంలో సర్వే నిర్వహించారు. మండల కేంద్రమైన కల్హేర్, మండల పరిధిలోని క్రిష్ణాపూర్, మహాదేవ్‌పల్లి, రాపర్తి గ్రామల్లోని చెరువుల వద్ద కాలువలు, షట్టర్లు, కట్టకు చేపట్టాల్సిన మరమ్మతు పనులపై నల్లవాగు ప్రాజెక్టు సర్వేయర్ సర్వే నిర్వహించారు.

సునీతారెడ్డిపై విమర్శలు మానుకోవాలి

శివ్వంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ కాలం గడుపుకోవడం తప్ప అభివృద్ధి పై దృష్టి సాధించడం లేదని జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్ విమర్శించారు. సోమవారం ఆయన శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు మానుకొని ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

ఊళ్లో ఉండేదెట్లా!!

(5వ పేజీ తరువాయి)

పెంచడానికి నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అదనంగా 50 టన్నుల సమర్థ్యం గల నాలుగు బట్టీలను నిర్మిస్తున్నారని తెలిపారు.

ఆందోళన చేసినా ఫలితం శూన్యం

కంపెనీ నుంచి రాత్రిళ్లు పెద్ద శబ్దాలు వస్తుండడంతో పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బలింతలు ఉలిక్కిపడుతున్నారని వాపోతున్నారు. ఈ బాధ భరించలేక చిన్నపిల్లలు ఉన్నవాళ్లు దూరంగా ఉన్న గ్రామాల్లో అద్దెకు ఉంటున్నారని చెప్పారు. పరిశ్రమ నుంచి దుమ్మూధూళి వెలువడుతుండడంతో పంటపొలాలు, గృహాలు మసిబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకి బోర్లు వేస్తే రంగుమారిన నీళ్లు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పరిశ్రమకు వ్యతిరేకంగా గత నెల గ్రామస్థులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. మరుసటి రోజు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు పరిశ్రమపై అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పరిశ్రమను తొలగించకపోతే గ్రామస్థులు ఒక్కొక్కరుగా ఊరును, ఇళ్లను వదిలి వలస వెళ్లడం ఖాయమని వాపోతున్నారు.

పరిశ్రమ 23 ఎకరాల్లో ఉంది

-విజయ్ భాస్కర్, చెట్లగౌరారం పంచాయతీ కార్యదర్శి

ఎమ్ఎస్ అగర్వాల్ పరిశ్రమ ప్రాంగణం రంగాయపల్లి, చెట్లగౌరారం రెండు గ్రామాల పరిధిలో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం 12 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టి నడిపిస్తున్నారు. కంపెనీ నుంచి ప్రతీ ఏడాది చెట్లగౌరారం పంచాయతీకి రూ.7.90లక్షలు, రంగాయపల్లికి 4 లక్షలు పన్ను వస్తున్నది.

విద్యారంగంలో కలాం సేవలు చిరస్మరణీయం



సంగారెడ్డి కలెక్టరేట్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌వో

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/కోహీర్/నారాయణఖేడ్/రామచంద్రాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): దేశ విద్యావ్యవస్థను తీర్చిదిద్దిన గొప్ప పరిపాలనాదక్షుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్, సంగారెడ్డి డీఆర్‌వో పద్మజారాణి పేర్కొన్నారు. సోమవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 136 జయంతిని పురస్కరించుకొని మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లలో ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం చిత్రపటాలకు అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీఆర్‌వో పద్మజారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆజాద్ నాయకత్వంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయాకార్యక్రమాల్లో మెదక్, సంగారెడ్డి జిల్లాల జిల్లా మైనార్టీ సంక్షేమాధికారులు జమ్లా నాయక్, దేవుజా, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ గీత, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మౌలానాఅబ్దుల్‌కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని ఆచార్య డిగ్రీకళాశాలలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, కలాం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోహీర్ ఎంఈవో కార్యాలయంలో, అలాగే దిగ్వాల్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖేడ్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ మాజీద్, ప్రిన్సిపాల్ ఖాదర్ మాట్లాడుతూ.. అబుల్ కలాం విద్యారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ ఘనంగా నివాళులర్పించారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. రామచంద్రాపురంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు షేక్ అబ్దుల్‌ఘనీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

సమగ్ర కుటుంబ సర్వేను పర్యవేక్షించిన అధికారులు



అల్లాదుర్గం: ముస్లాపూర్‌లో కుటుంబసర్వేను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా సహకార అధికారి కరుణ

నారాయణఖేడ్/కల్హేర్/నాగల్ గిద్ద/అల్లాదుర్గం/నిజాంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండలం తుర్కపల్లిలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించి, అన్ని వివరాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. వెంట ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి పరిశీలించారు. సిర్గాపూర్ మండలంలోని వంగ్దల్ గ్రామంలో సర్వేను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. కల్హేర్ మండలంలోని క్రిష్ణాపూర్‌లో సర్వేను ఆర్డీవో, కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్‌లు పరిశీలించారు. నాగల్‌గిద్ద మండలంలోని పూసల్‌పాడ్‌లో సర్వేను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. అల్లాదుర్గం మండలంలో నిర్వహించిన సర్వేలో మెదక్ జిల్లా సహకార అధికారి, అల్లాదుర్గం మండల ప్రత్యేక అధికారి కరుణ పర్యవేక్షించారు. నిజాంపేట మండలంలోని చల్మెడ, రాంపూర్, బచ్చురాజ్ పల్లి, జెడ్ చెరువు తండా గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి గోవింద్ పర్యటించి కులగణన సర్వేను పరిశీలించారు.

ఆలయాల్లో కార్తీక సందడి



బొంతపల్లి వీరన్న వీరభద్ర ఆలయ ఆవరణలో దీపాల వెలుగులు

గుమ్మడిదల/ఝరాసంగం/పెద్దశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం గ్రామంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో కార్తీక సందడి నెలకొన్నది. రెండో సోమవారం సందర్భంగా ఆలయంలో భద్రకాళీ సహిత వీరభద్రస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కార్తీక దీపాలను వెలించడంతో ఆలయ పరిసరాలు దీపాలకాంతిలో వెలిగిపోతూ అందరినీ ఆకట్టుకున్నాయి. ఝరాసంగం మండలంలోని శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర్ స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని అధికసంఖ్యలో మహిళలు విచ్చేసి కార్తీక దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలి



ఖేడ్‌లో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడా జ్యోతిని క్రీడాకారులకు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్,నవంబరు11(ఆంధ్రజ్యోతి):గ్రామీణ క్రీడాకారులు సైతం జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో 6, 10 జోన్లకు సంబంధించి జోనల్ స్థాయి క్రీడా పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమీషనర్ జగ్జీవన్, నాయకులు, గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వగృహంలో గురుపాదుకా పూజ

నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో సోమవారం నిర్వహించిన గురుపాదుక కార్యక్రమంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర సిద్ధాంతి పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఖేడ్‌లో మొట్టమొదటి సారిగా గురుపాదుకార్చన నిర్వహించే అవకాశాన్ని ఎమ్మెల్యే దంపతులు విద్యాపీఠానికి అందించారన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేసంజీవరెడ్డి దంపతులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాదుకలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురుపాదుకార్చన, శివపంచాక్షరి జపయజ్ఞం, జోలే పూజ, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కాపలాకు వెళ్లి మృతి



దుర్గయ్య (ఫైల్)

హత్నూర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కాపలాకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుకు గురై ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పూల దుర్గయ్య (55) ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి కాపలా కోసం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం నిద్రపోయిన చోటనే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య బాగ్యమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబీకులు స్థానికులు ఇంటికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా ఉంటే చర్యలు



పుల్‌కల్: ఉప్పరిగూడెంలో కొనుగోళ్ల రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో జ్యోతి

పుల్‌కల్/కల్హేర్/వట్‌పల్లి/రేగోడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి సూచించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని వెండికోలు, వెంకటకిష్టాపూర్, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, మిన్‌పూర్ గ్రామాలలో ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) అధ్వర్యంలో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో ఐకేపీ నిర్వహణలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి పరిశీలించారు. ఆర్డీవో వెంట కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు. వట్‌పల్లి మండల పరిధిలోని బిజిలిపూర్, కేరూర్, ఖాదిరాబాద్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏడీఏ సత్యనారాయణ తనిఖీ చేసి తేమ శాతాన్ని పరిశీలించారు. మెదక్ జిల్లా రేగోడు మండలంలోని కొత్వాల్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రాయికోడ్ టీపీసీసీమెంబర్ మున్నూరు కిషన్, అధికారులు ప్రారంభించారు.

వెల్‌నెస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు



మందులు అందజేస్తున్న కౌన్సిలర్ విష్ణువర్ధన్, హాస్పిటల్ సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని కింది బజార్‌లో వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. స్థానిక ప్రజలకు ఈసీజీ, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ క్యాంపులో 3వ వార్డు కౌన్సిలర్ ఎం.విష్ణువర్ధన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జగన్, హాస్పిటల్ డా.రఫీ, మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేగుంట లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం విశ్రాంత ఉపాధ్యాయ కార్యాలయంలో ఆయుష్మాన్ బ్లడ్ బ్యాంక్ మెదక్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు బుర్క నాగరాజు, రజనక్ రామచంద్రం,న్యాలపల్లి సతీష్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలి

చిలప్‌చెడ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలో మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఎంఈవో విఠల్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కాంప్లెక్స్ భవనంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు న్యాస్ ఎగ్జామ్ పై సమావేశాన్ని నిర్వహించారు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు తరగతి గది నిర్వహణ చర్యలు, కృత్యాల నిర్వహణ గురించి వివరించారు. డిసెంబరు నెలలో నిర్వహించనున్న నేషనల్ అచీవ్ మెంట్ సర్వేలో చిలప్‌చెడ్ మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలోనే నిలపాలని సూచించారు.

వీర శైవ లింగాయత్ జిల్లా కోశాధికారిగా సంతోష్‌కుమార్



పుల్‌కల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వీర శైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా కోశాధికారిగా పోలీస్ సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. జహీరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పోలీస్ సంతోష్‌కుమార్ వీర శైవ లింగాయత్‌ల సంక్షేమానికి చేస్తున్న సేవలు, సంక్షేమాన్ని గుర్తించి జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా గౌరవాధ్యక్షుడిగా సులుగంటి సిద్దేశ్వర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇప్పపల్లి నర్సింలు, కొంక రాజేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా పట్లోళ్ల చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. వీరంతా ఈ నెలాఖరులో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా జిల్లా కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది సీహెచ్.బస్వరాజ్, శివచంద్రకుమార్ పాటిల్‌లు వ్యవహరించారు.

జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న గ్రంథాలయసంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య

రాయికోడ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, శిథిలావస్థలో ఉన్న వాటి స్థానంలో కొత్త గ్రంథాలయాలు నిర్మించేందుకు ప్రణాళికలతో ముందుకెళ్లనున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగ్వార్‌లో ఇటీవల గ్రంథాలయ చైర్మన్‌గా నియామకమైన సందర్భంగా మండల కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం అంజయ్యమాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఉదయం 8గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరుపేద విద్యార్థులు గ్రంథాలయంలో చదువుకోవడానికి అనువుగా సమయాన్ని మార్పు చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్‌సిద్దన్నపాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు, కాంగ్రెస్‌కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు హర్షణీయం

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): గురుకులాలు, వసతి గృహ విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులడు దొంత నరేందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శేషాచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర ధరలకు అనుగుణంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డైట్ చార్జీలను పెంచి విద్యార్థుల సంక్షేమం పట్ల సర్కార్ ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. సమావేశంలో టీహెచ్‌డబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షుడు గౌస్ హష్మీ, జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు వెంకటరెడ్డి, అందోల్ యూనిట్ అధ్యక్షుడు నర్సింలు, టీహెచ్‌డబ్ల్యూవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముజాహిద్, టీఎస్‌డబ్ల్యూవో మెదక్ జిల్లా కార్యదర్శి శేఖర్, సంక్షేమ అధికారులు తులసీరాం, జయరాజ్, విక్రమ్, సుధాకర్‌రెడ్డి, మహేందర్, ఉమా, శాంతాబాయి, భూలత, జ్యోతి, జులేద, పద్మజ, గాయత్రి, సత్యం, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.